క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో వ్రత పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సూర్య భగవానుడికి సామూహిక పూజలు



ఏరు పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండుతున్న భక్తులు

రంగంపేట: కోటపాడు గ్రామంలో ఆదివారం సూర్యభగవానుడికి సామూహిక పూజలు జరిగాయి. స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకటఅమర్‌నాథ్ ఆధ్వర్యంలో మాఘ మాసం సందర్భంగా ఆదిత్యుడికి సామూహిక పాల పొంగలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, ఏరు పిడకలతో పొయ్యి వేసి, క్షీరాన్నం వండి ప్రసాదంగా పంపిణీ చేశారు.

ఘనంగా గోగులమ్మ తల్లి తీర్థం

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలో ఉన్న గోగులమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ చేశారు. భారీఎత్తున అన్న సమారాధన జరిగింది. కొమరిపాలెం, పందలపాక, తొస్సిపూడి, బలభద్రపురం, కొప్పవరం తదితర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గుర్తింపు కార్డు నమోదు వేగవంతం చేయాలి



బిక్కవోలు కేంద్రంలో ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంఏఓ

బిక్కవోలు: మండలంలో రైతు గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంఏఓ సామ్యూల్ జాన్ అన్నారు. ఆదివారం ఆయన బిక్కవోలు, పందలపాక, ఊలపల్లి రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందితేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ ఎగ్జామ్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజానగరం: పదో తరగతి విద్యార్థులకు స్థానిక దివ్య జూనియర్ కళాశాలలో స్టేట్ లెవెల్ ఆబ్జెక్టివ్ మోడల్ ఎగ్జామ్ ఆదివారం జరిగింది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 786 విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిన మొదటి విద్యార్థికి రూ.ఐదు వేలు, రెండో విద్యార్థికి రూ.మూడు వేలు, మూడో విద్యార్థికి రూ.రెండు వేలతో పాటు, సర్టిఫికెట్ అందజేస్తామని నిర్వాహకులు బర్ల విజయ్ తెలిపారు. పబ్లిక్ పరీక్షకు ముందు ఇటువంటి పరీక్షల వల్ల విద్యార్థులలో పరీక్షలంటే సహజంగా ఉండే బెరుకును పోగొట్టవచ్చన్నారు.

గోదావరి ఘాట్ల పరిశుభ్రత

కంబాలచెరువు: మహా శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు మూడు ఘాట్లు శుభ్రం చేశారు. శనివారం 50 మంది త్యాగరాజ గాన సభ సమీపంలోని దోభీ ఘాట్లో వ్యర్థాలను తొలగించారు.

పెంటాస్టిక్

- గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు
- చెత్త నుంచి సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టి
- ప్రజలకు అవగాహన కలిగిస్తూ స్పెషల్ డ్రైవ్

రాజానగరం: జనావాసాలు ఉండే చోట కాస్త ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. ఆ ప్రాంతమంతా చెత్తకు నిలయంగా మారిపోతుంది. ఇంటిని శుభ్రం చేసుకుంటాం, చెత్తను మాత్రం ఇంటి బయట పారవేస్తుంటాం. దీనితో పరిసరాలు అపరిశుభ్రమై, ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇటువంటి వాతావరణంతో ఆయా ప్రాంతాల్లో అంటు రోగాలు, సీజనల్ వ్యాధులు ప్రబలి, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇంటిని ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తారో, అలాగే పరిసరాలను కూడా శుభ్రంగా చూసుకోవాలనే తలంపు చాలా మందిలో లోపించడం వల్లే అపరిశుభ్రత తాండవిస్తుంది. అనారోగ్యాలకు కారణమవుతుంది. ఇటువంటి వాతావరణాన్ని సమూలంగా మార్చాలనే తలంపుతో క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛ భారత్–స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టినా ఆశించిన ఫలితాలు కానరావడం లేదు.

చెత్త నుంచి సంపద సృష్టి

తాజాగా చెత్త నుంచి సంపద సృష్టి అనే నినాదంతో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు ప్రజలు చేయవలసిన పని ఏమిటనే దానిపై అవగాహన కలిగిస్తూ నిర్వహిస్తున్న బృహత్తర కార్యక్రమం రెండు రోజులపాటే అయినా, ఆరంభ శూరత్వంగా మిగిలిపోకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల పాటు ఉదయం ఆరు గంటలకే ప్రజల ఇళ్ల వద్దకు వచ్చి, చెత్తను సేకరించిన సిబ్బంది, తరువాత కూడా ఆ విధానాన్ని కొనసాగించాల్సి ఉంది. రెండు రోజులతోనే అయిపోయిందన్నట్టుగా మిన్నకుంటే, మరలా ఎక్కడి చెత్త అక్కడే అన్నట్టుగా పరిస్థితి తయారవుతుందని ప్రజలు అంటున్నారు.



పాలచర్లలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది



రాజానగరంలో స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ శాంతమణి

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

పంచాయతీల ద్వారా ఇప్పటికే ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరించేందుకు రెండు బుట్టలను ఉచితంగా అందజేశారు. నిత్యం ఆయా ఇళ్లలోని చెత్తను వాటిలో తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా వేసి, పంచాయతీ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందజేయాలి. తద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల నుంచి మొదటి అడుగు పడుతుంది. సేకరించిన చెత్తను ఉత్పత్తి కేంద్రాలకు పంచాయతీ సిబ్బంది తరలిస్తారు. అక్కడ జరిగే ప్రాసెస్ ద్వారా చెత్త నుంచి సంపదను సృష్టించే ప్రయత్నం చేస్తారు. పనికిరాదని పార వేసే చెత్త కూడా రీ సైక్లింగ్ విధానం ద్వారా పంటలకు ఎరువుగానూ, విద్యుత్ తయారీకి తోడ్పడుతుంది. ఈ విధానాన్ని ప్రతి పంచాయతీ సమర్థవంతంగా నిర్వర్తిస్తే, చెత్తను ఉత్తినే పారవేయడానికి కూడా జనం సంకోచిస్తారనడంలో సందేహం లేదంటున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి

గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలే కాదు, రోడ్ల పక్కన మార్జిన్లు కూడా చెత్తకు నిలయాలుగా మారిపోతున్నాయి. వీటిని నివారించి చెత్తను ఇష్టానుసారంగా పారవేయకుండా, పరిసరాల పరిశుభ్రతకు తావిచ్చేలా ప్రజల్లో అవగాహన కలిగించాలనే ఉద్దేశంతోనే కమిషనర్ ఆదేశాల మేరకు చెత్త నుంచి సంపద సృష్టిద్దామంటూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పరిసరాల పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తే వచ్చే అనర్థాలను వివరించడం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– శాంతమణి, జిల్లా పంచాయతీ అధికారి

మెట్టలో ఆశాజనకంగా నువ్వుల సాగు



రంగంపేటలో కళకళలాడుతున్న నువ్వుల పంట

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని పలు గ్రామాల్లో నువ్వుల సాగు ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. గతంలో అధిక శాతం మెట్ట రైతులు నువ్వులను సాగు చేసేవారు. ధర ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పంట సాగును రైతులు తగ్గించేశారు. ప్రస్తుతం కొద్దిమంది రైతులు మాత్రమే తమ అవసరాల కోసం నువ్వుల పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో సుమారు వంద ఎకరాలలో రైతులు నువ్వుల పంటను సాగు చేశారు. పూత, పిందె, కాయలతో పంట కళకళలాడుతోంది. ఈ దశలో అక్కడక్కడా పంటపై చిన్న పురుగు ఆశించే అవకాశం ఉందని, దానికి క్లోరోఫైరీఫాస్ 2.1 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు.

కనుల పండువగా భీమేశ్వరుని కల్యాణం

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో బిక్కవోలు వెళ్లే రోడ్డులో కొలువైన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో దివ్య కల్యాణం ఆదివారం ఉదయం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి పరవశులయ్యారు. ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తలు ద్వారంపూడి వీరరాఘవులు(పాపిరెడ్డి), సత్యవతి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణతో తీర్చిదిద్దారు. భారీ బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా వీరరాఘవులు మాట్లాడుతూ, ఆలయాన్ని ఇటీవల రూ.15 లక్షలు వెచ్చించి పునర్నిర్మాణం చేశామన్నారు. గత 32 ఏళ్లుగా స్వామి కల్యాణం వైభవం నిర్వహిస్తున్నామన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలు ఉత్సాహంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న వీరరాఘవులు, సత్యవతి దంపతులు

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లిన తన కుమార్తె తిరిగి రాలేదని కవలగొయ్యి గ్రామానికి చెందిన లోలుగు పాపారావు ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు, కవలగొయ్యి గ్రామానికి చెందిన 19 ఏళ్ల వినీల శనివారం ఉదయం స్కూటీపై మేనత్తను, చెల్లిని ఎస్‌వీ జనరల్ మార్కెట్‌కు తీసుకువెళ్లింది. అక్కడి నుంచి వినీల బ్యాంక్‌కు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. స్కూటీని అక్కడ పార్కింగ్ చేసి, తాళాలు డిక్కీలో వేసి వెళ్లింది. ఆమె ఫోన్ చేసినప్పటికీ, ఇక తాను రానని చెప్పినట్లు ఆమె తండ్రి పాపారావు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బొమ్మూరు ఏఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటనగరం వీఆర్వో మృతి

రాజమహేంద్రవరం రూరల్: వెంకటనగరం వీఆర్వో గునపాటి మురళీకృష్ణ(49) ఆదివారం అనారోగ్యంతో రాజమండ్రిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మరణించారు. ఆయన స్వగ్రామం ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామం. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భక్తుల నడక మార్గం రెడీ

వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై ఏర్పాటు

సీతానగరం: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు జిల్లా పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం గోదావరి పాయపై నడక మార్గం (వారధి)ని ఏర్పాటు చేశారు. వంగలపూడి రేవు నుంచి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాటైన ఉత్సవ కమిటీ సూచనలతో, రేవులో మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయపై సిమెంట్ తూరలు వేసి, భక్తులు ప్రయాణించేలా నడక మార్గాన్ని ఏర్పాటు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి వెళ్లే అవకాశం ఉంది. రేవు నుంచి గోదావరి పాయపై వేసిన వారధి వరకు నగదు చెల్లించి ట్రాక్టర్లపై భక్తులు వెళ్లవచ్చు. అక్కడి నుంచి వారధి దాటిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ట్రాక్టర్లపై వీరభద్రుని ఆలయానికి చేరుకోవచ్చు. ట్రాక్టర్లపై ప్రయాణానికి చార్జీలు నిర్ణయిస్తారు. సైకిల్ స్టాండ్ ఏర్పాటు, భక్తులకు పలు సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టారు. మంగళవారం నాటికి ఏర్పాట్లు పూర్తయ్యేలా ముమ్మరంగా పనులు చేస్తున్నారు.



వంగలపూడి రేవు గోదావరి పాయపై ఏర్పాటు చేసిన నడక మార్గం

వైభవంగా సత్తెమ్మ తల్లి సంబరం



సత్తెమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: ప్రసిద్ధి చెందిన తణుకు వంశీకుల ఇలవేల్పయిన సత్తెమ్మ తల్లి సంబరం బిక్కవోలులోని ఊలపల్లి రోడ్డులో ఆదివారం ఘనంగా జరిగింది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలను తణుకు వంశీకులు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. తొలి రోజు పంబ నాదపు కళాకారులు అమ్మవారి చరిత్రను వివరించగా, రెండో రోజు ఘట రూపంలో ఉన్న అమ్మవారికి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తీన్‌మార్ వాయిద్యాలు, డప్పు డ్యాన్సులతో ఉత్సవం జరిగింది. మూడో రోజు తమ కోర్కెల ఫలసిద్ధికి అమ్మవారి ప్రతిష్టాపనంలో గతంలో పాతిపెట్టిన నాణేలను భక్తులు చేజిక్కించుకుని, కొత్తగా నాణేలను పాతడం ఆనవాయితీ. భక్తులకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తణుకు సూరిబాబు, ఇతర సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

డీఎల్‌పీఓ నాగలత

రంగంపేట: వ్యర్థంగా పారవేసే చెత్త నుంచి సంపద సృష్టించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత అన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఎస్టీ రాజాపురం గ్రామంలో ఆమె విస్తరణాధికారి పి.వెంకటరత్నంతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో గ్రామాల్లో రెండు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ప్రతి గ్రామంలోను ఇంటింటికీ వెళ్లి, చెత్తను సేకరించినట్టు చెప్పారు. గ్రామాల్లో ఉన్న సంపద సృష్టి కేంద్రాలపై వివరించి, తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించడం, వీటి ద్వారా వర్మీ కంపోస్టు తయారీపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు వివరించారు. రంగంపేట మండలంలో 12 చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. అందులో ఐదు కేంద్రాలలో వర్మీ కంపోస్టు తయారీ జరుగుతుందన్నారు. మిగిలిన ఏడు కేంద్రాలలో కూడా దీనిని ప్రారంభిస్తామని, ప్రజలందరూ సేంద్రియ ఎరువు తయారీకి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఎస్టీ రాజాపురంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ నాగలత

నిరాశ్రయులపై చులకన భావం తగదు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక, పట్టణాలపై మోజుతో అసంఘటిత కార్మికులు నిరాశ్రయులుగా మారుతున్నారని షెల్టర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జి.రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. నిరాశ్రయులను పరాన్న జీవులని ప్రస్తావించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్ వ్యాఖ్యలు సరికాదని అభ్యంతరం తెలిపారు. ఆదివారం స్థానిక లాలాచెరువు సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి నిరాశ్రయులతో కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, నిరాశ్రయిలను గౌరవప్రదమైన పౌరులుగా జీవించడానికి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రాంబాబు కోరారు. నిరాశ్రయుల సమస్యలపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అందుకే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులందరికీ తినడానికి తిండి, నివాసయోగ్యమైన గృహం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. స్వల్ప కారణాల వల్ల పౌరులు నిరాశ్రయులుగా మారడాన్ని ప్రభుత్వం అధ్యయనం చేసి, వారిపై సానుకూల భావం, సానుభూతి వ్యక్తం చేయలే కానీ పరుష పదజాలంతో దూషించడం సరైన విధానం కాదన్నారు.

మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసానికి స్కౌట్స్ శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్కౌట్ శిక్షణతో తరగతి గదిలో పొందే జ్ఞానం కంటే, అత్యధిక మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని స్కౌట్ అండ్ గైడ్స్ నేషనల్ హెడ్‌క్వార్టర్స్ ప్రతినిధి డీఆర్‌కే శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక రైల్వే క్వార్టర్స్ ఆవరణలో దక్షిణమధ్య రైల్వే భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాజరాజనరేంద్ర అండ్ గోదావరి ఓపెన్ గ్రూప్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్ సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. సీనియర్ స్కౌట్ మాస్టర్ సుబ్బరాయశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా స్కౌట్ పతాకాన్ని విద్యార్థులు ఆవిష్కరించారు. నేషనల్ హెడ్ క్వార్టర్స్ ప్రతినిధి శర్మ, ప్రాంతీయ అసిస్టెంట్ అడ్మిన్ కమిషనర్ దాడి ప్రసాద్ మాట్లాడుతూ, పిల్లలు స్కౌట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. జీఆర్‌పీఎఫ్ ఎస్సై పెద్దిరాజు మాట్లాడుతూ, పిల్లల్లో మంచి నడవడిక ఉండాలంటే స్కౌట్స్ శిక్షణ అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంహిత డిగ్రీ కళాశాల విద్యార్థులు స్కౌట్ ఉద్యమంలో పాల్గొన్నారు.



యోగాసనం వేస్తున్న విద్యార్థులు

శివశివా.. అంత చిన్నచూపా..?

- కోటిలింగేశ్వరుని సాక్షిగా దళితులపై వివక్ష
- మహా శివరాత్రి ఏర్పాట్లలో స్థానికేతరులకు పెద్దపీట
- కూటమి నాయకుల పెత్తనం
- కనీసం స్థానిక నేతలనూ పిలవని వైనం
- మద్యం, ఇసుక సిండికేట్‌ను శాసిస్తున్న వ్యక్తి కీలకపాత్ర
- కలెక్టర్, ఎస్పీలకు దళిత నాయకుల ఫిర్యాదు



గోదావరి గట్టున ఉన్న కోటిలింగాల క్షేత్రం

సీటీఆర్ఐ: గిద్దెడు నీళ్లు పోస్తే పరవశించిపోతాడు పరమ శివుడు. గొప్పవాడు, పేదవాడు, లేనివాడు, ఉన్నవాడనే తేడా లేకుండా అందరినీ కరుణించే పరమ శివుడి దేవస్థానంలో దళితులను చిన్నచూపు చూస్తున్న వైనమిది. దక్షిణ కాశీగా పేరొందిన గోదావరి గట్టున ఉన్న కోటిలింగేశ్వర స్వామివారి మహా శివరాత్రి మహోత్సవాల వేళ కులాల మధ్య కూటమి పాలకులు చిచ్చుపెడుతున్నారు. ఈ కోటిలింగేశ్వర స్వామివారి క్షేత్రం అతి ప్రాచీనమైంది. ఈ ఆలయం నగరపాలక సంస్థ 41వ డివిజన్‌లోని కోటిలింగాలపేటలో ఉంది. ఇక్కడ అత్యధికంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయంలోని పరమేశ్వరుడికి శివరాత్రి రోజున వేడుకల్లో అన్ని వర్గాలు కలిసి, వేడుకలను ఘనంగా నిర్వహిస్తూ వచ్చారు.

పాలక మండలి లేదు, ఉత్సవ కమిటీ లేదు..

గత వైఎస్సార్ సీపీ పాలనలో ఆలయానికి పాలక మండలి ఉండేది. వారి ఆధ్వర్యంలో ఆలయంలో ఏ ఉత్సవమైనా అందరూ కలిసి చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాలక మండలిని ఇంకా ఏర్పాటు చేయలేదు. అంతేకాకుండా శివరాత్రి పర్వదినాన ఉత్సవ కమిటీ సైతం ఏర్పాటు చేయలేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో ఉత్సవ కమిటీని వేయలేదంటున్నారు. ఇదే అదనుగా కూటమి నాయకులు కొందరు వారికి వారే శివరాత్రి ఉత్సవాలు చేయడానికి ఆలయ ఏఓ లక్ష్మీబాయితో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు. అందరినీ కలుపుకొని వెళ్లాల్సినవారు మాత్రం తమ సామాజిక వర్గానికి చెందిన వారితోనే కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

చిచ్చు పెట్టే నాయకులకు కళ్లెం వేయాలి

తమ సామాజిక వర్గానికి చెందిన వారిని కనీసం పిలవకుండా పోస్టర్‌ను ఆవిష్కరించడమే కాకుండా, ఏర్పాట్లు చేయడంపై కోటిలింగాలపేట దళిత సామాజిక వర్గానికి చెందిన పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడు లిక్కర్, ఇసుక సిండికేట్ పెద్దగా వ్యవహరిస్తున్నాడు. అతని అనుచరులతో కలిసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై ఆవేదన చెందిన దళిత నాయకులు కలెక్టర్ ప్రశాంతికి, ఎస్పీ నరసింహ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరిస్తున్న నాయకులను అదుపు చేయాలంటూ వినతిపత్రంలో కోరారు.

లింగోద్భవ సమయంలో టికెట్ రూ.200

ఆలయ ఏఓ లక్ష్మీబాయి, కూటమి నాయకులు కలసి శివరాత్రి రోజున లింగోద్భవ సమయంలో టికెట్ ధరను అమాంతం పెంచి, సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టికెట్ ధరను రూ.200కి పెంచడానికి నిర్ణయం తీసుకోవడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. పాలక మండలి లేకుండా, ఉత్సవ కమిటీ లేకుండా ఏఓ ఎలా నిర్ణయం తీసుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భగవంతుని దర్శనానికి ఇంత రేటు పెట్టడం వల్ల సామాన్యులు ఎలా దర్శించుకుంటారని నిలదీస్తున్నారు.

అంతా కలిసి వైభవంగా చేసే వాళ్లం



మా పేటలో ఎప్పుడూ కులాల మధ్య రచ్చ జరగలేదు. ఎన్నో సంవత్సరాల నుంచి మా పూర్వీకుల వద్ద నుంచి మేమందరం కలిసి స్వామివారికి సేవలు చేస్తున్నాం. అటువంటిది ఏకపక్ష నిర్ణయాల వల్ల అనేక ఇబ్బందుల వస్తున్నాయి. కనీసం మా సామాజికవర్గం నుంచి ఒక్కరిని కూడా పిలవలేదు. గతంలో బ్రాహ్మణులు, రజకులు, కాపులు, ఎస్సీలు అందరం కలిసి శివరాత్రిని ఘనంగా నిర్వహించే వాళ్లం.

– వల్లూరి రాజ్‌కుమార్, స్థానికుడు

కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. కులాల మధ్య చిచ్చు పెట్టేలా కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశాం. మేము ఫిర్యాదు చేసిన తరువాత వారికి కావాల్సిన దళితులిద్దరితో పోస్టర్ ఆవిష్కరించినట్లు ఫొటో తీశారు. దేవుని సేవకి మాకు కూడా అవకాశం కల్పించాలని అధికారులను కోరాం.

– ఎస్.శ్రవణ్ కుమార్, స్థానికుడు

అలరించిన అష్టావధానం



సందీప్‌శర్మను సత్కరిస్తున్న పృచ్ఛకులు

సీటీఆర్ఐ: తపస్సు, శిరస్సు, మనస్సు, ధనస్సు వంటి పదాలను ఉపయోగించి దత్తపదిలో మహాభారతార్థంలో పద్యం చెప్పమని పృచ్ఛకుడు అడగ్గా, పాశుపతాస్త్రం కోసం శివుడికి తపస్సు చేసిన అర్జునుని కథలో వీటిని జోడించి శతావధాన శరచ్చంద్ర డాక్టర్ తాతా సందీప్ శర్మ అద్భుతంగా వర్ణించారు. అక్కడున్న విశిష్ట అతిథులను అలరించారు. ఆదివారం అష్టావధానం సాహిత్య క్రతువులో భాగంగా స్థానిక సాదుశాంతి తత్త్వర్శినీ సత్సంగంలో అష్టావధాన ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు అవధాని సందీప్ శర్మ అలవోకగా సమాధానాలు చెప్పారు. సమర్పణ వీవీ సుబ్రహ్మణ్యం చేయగా, డాక్టర్ ధూళిపాళ మహదేవమణి సంచాలనం చేశారు. వీరితో పాటు సాహితీవేత్తలు రాయప్రోలు కామేశ్వరశర్మ, వాడపల్లి అన్నపూర్ణ, ఇటికిరాల పద్మావతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవధాని సందీప్ శర్మను సత్కరించారు.